నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ శుక్రవారం 27 డిసెంబర్ 2024 | ADILABAD NIRMAL

భిక్షాటన చేసి..

17వ రోజుకు చేరుకున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 26 : నిర్మల్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపడుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమ్మె బుధవారం నాటికి 17వ రోజుకు చేరుకుంది. నిరసనలో భాగంగా భిక్షాటన చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంగాధర్, రాజారత్నం, నరేశ్, తిరుపతి, నవిత, వీణ, అపర్ణ, పుష్పలత, రాధిక, శ్రీలత, గంగామణి, ప్రభ పాల్గొన్నారు.

భిక్షాటన చేసి నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

ఆదిలాబాద్ మార్కెట్‌యార్డుకు పత్తి లోడ్‌లతో వచ్చిన భారీ వాహనాలు

కాంటాపై పత్తి వాహనం →

మాయాజాలం

పత్తి కొనుగోళ్లలో దళారుల దందా

- భారీ వాహనాల్లో వందల క్వింటాళ్ల పత్తి రాక
- రైతుల పట్టాల పేరిట విక్రయాలు
- మార్కెటింగ్ అధికారుల పర్యవేక్షణ కరువు

ఆదిలాబాద్, డిసెంబర్ 26(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో దళారుల దందా కొనసాగుతున్నది. పత్తి దళారులు మాయాజాలం ప్రదర్శిస్తూ అమాయక రైతుల పేరిట వందల క్వింటాళ్ల పత్తిని సీసీఐకి విక్రయిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. మండల కేంద్రాల్లో రైతుల వద్ద నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ మద్దతు ధరతో సీసీఐకి విక్రయిస్తున్నారు. నార్నూర్, ఇంద్రవెల్లి, ఇచ్చోడ, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాలకు చెందిన దళారులు దందాకు పాల్పడుతున్నారు. దళారులు పక్క రాష్ట్రం పత్తిని వాహనాల్లో తీసుకొచ్చి జిల్లాలోని రైతుల పట్టాలను తీసుకుని సీసీఐకి విక్రయిస్తూ భారీగా డబ్బు ఆర్జిస్తున్నారు. గురువారం నార్నూర్, ఇంద్రవెల్లి, ఇచ్చోడ మార్కెట్ యార్డుల్లో పంట కొనుగోళ్లు జరగకపోగా.. ఆదిలాబాద్ మార్కెట్ యార్డు పత్తి వాహనాలతో నిండిపోయింది. ఇచ్చోడ నుంచి ఐచర్ వాహనంలో వంద క్వింటాళ్ల పత్తిని ఓ దళారి గురువారం ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు తీసుకొచ్చాడు. బజార్‌హత్నూర్ మండలానికి చెందిన ఓ రైతుకు చెందిన పడెకరాల పట్టాతోపాటు, ఆధార్ కార్డులను జతచేసి డ్రైవర్ వద్ద ఉంచాడు. వాహనంలో ఆ రైతు కూడా ఉన్నాడు. పంట ఎక్కడిదని అడిగితే నాకు తెలియదు ఓ వ్యాపారి రూ.5 వేలు ఇస్తానని అన్నాడు. తాను పట్టా పాసుపుస్తకాలు, ఆధార్ కార్డు ఇచ్చా. నన్ను వాహనంలో ఆదిలాబాద్‌కు పోయిరమన్నాడని ఆ అమాయక రైతు సమాధానం ఇచ్చాడు. ఇంద్రవెల్లికి చెందిన మరో దళారి ఉట్నూర్ మండలానికి చెందిన రైతుల పట్టాలతో ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు వచ్చి పంటను విక్రయించాడు.

లోపించిన పర్యవేక్షణ

మార్కెట్ యార్డుల్లో పత్తి కొనుగోళ్లకు సంబంధించి అధికారులు పర్యవేక్షణ లోపించడంపై రైతుల సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో దళారులకు సీసీఐకి రైతుల పేరిట వందల క్వింటాళ్ల పత్తిని విక్రయించినా అధికారులు తనిఖీలు నిర్వహించలేదన్నారు. పత్తి కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా, అక్రమాలు జరగకుండా వివిధ శాఖల అధికారులను నియమించారు. పత్తి కొనుగోళ్లలు రైతులు నష్టపోకుండా, దళారి వ్యవస్థకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

❖ దళారుల దందాను అరికట్టాలి..

జిల్లాలో పత్తి విక్రయాల్లో దళారుల దందాను నివారించాలి. రైతుల వద్ద నుంచి తక్కువ ధరకు పంటను కొనుగోలు చేస్తున్న దళారులు, మద్దతు ధరకు సీసీఐకి విక్రయిస్తున్నారు. అమాయక రైతులను డబ్బులు ఆశగా చూపి వారి పట్టాపాసు పుస్తకాలు, ఆధార్‌కార్డులు తీసుకుని పంటను వారి పేరిట అమ్ముతున్నారు. వంద క్వింటాళ్ల పంటను తీసుకొచ్చే వారి వివరాలను క్షణ్ణంగా పరిశీలించాలి. **- బొరన్న, రైతు, స్వరాజ్య వేదిక, జిల్లా అధ్యక్షుడు**

నేరడిగొండలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

వైద్య ఖర్చుల కోసమే సీఎంఆర్ఎఫ్

నేరడిగొండ, డిసెంబర్ 26 : ఆస్పత్రిలో వైద్య ఖర్చుల కోసమే ముఖ్యమంత్రి సహాయనిధి నిధులు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. గురువారం నేరడిగొండలోని ఆయన నివాసంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కుమారి గ్రామానికి చెందిన రుక్మాబాయికి రూ.22,500, కాసీరాంకు రూ.27,000, ఇచ్చోడ మండలంలోని సాత్‌నంబర్‌కు చెందిన జాదవ్ కౌసల్యకు రూ.25,500, ముఖ(బి) గ్రామానికి చెందిన ముసిరా బికి రూ.19,500, వడూర్ గ్రామానికి చెందిన సాయిచరణ్ తేజ్‌కు రూ.18,000, ప్రవీణ్‌కు రూ.18,000, డి సునీతకు రూ.24,000, ఎస్ లక్ష్మీకి రూ.20,500, ఆర్ రాజేశ్వర్‌కు రూ.27,000 ల విలువ గల చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, నాయకులు శ్రీకాంత్, చంద్రశేఖర్, రుక్మాణ్‌సింగ్, శ్రీధర్‌రెడ్డి, మారుతి, దేవేందర్‌రెడ్డి, పండరీ, ప్రతాప్‌సింగ్, అభిరాం రెడ్డి పాల్గొన్నారు.

ఒకరికి ఆరు నెలల జైలు

ఎదులాపురం, డిసెంబర్ 26 : భూ వివాదంలో అన్నపై దాడి చేసిన తమ్ముడికి ఆరు నెలల జైలు శిక్ష తోపాటు రూ.3 వేల జరిమానా విధిస్తూ జేఎఫ్‌సీఎం ఎస్‌పీఎల్ కోర్టు టి.దుర్గారాణి తీర్పును వెలువరించినట్లు జిల్లా కోర్టు లైజన్ అధికారి ఎం.గంగాసింగ్ తెలిపారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని రాంపూర్ రామాయి గ్రామానికి చెందిన దొరిశెట్టి పంచపుల ఇంటి పక్కన నివసించే మరిది దొరిశెట్టి సకారం దొరిశెట్టి పంచపుల ఇంటి స్థలంలో సకారం 21 అక్టోబర్ 2018 గుంత తవ్వాడు. మా ఇంటి స్థలంలో ఎందుకు గుంత తవ్వావని అడిగినందుకు భర్త నారాయణపై సకారం కట్టెతో తలపై బలంగా కొట్టి పారిపోయాడు. రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై ఎ.హరిబాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. వివిధ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. గురువారం ఎనిమిది మంది సాక్షులను అదనపు పీపీ నవీన్‌కుమార్ విచారించగా కేసు రుజువు అయింది. దీంతో అన్నపై దాడి చేసిన దొరిశెట్టి సకారంకు ఆరు నెలల జైలుశిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చినట్లు తెలిపారు.

దారిదోపిడీ యత్నం కలకలం

గుడిహత్నూర్, డిసెంబర్ 26 : గుడిహత్నూర్ మండల కేంద్రానికి సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం రాత్రి ఓ ముఠా దారి దోపిడీకి యత్నించడం కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రానికి చెందిన బండి సురేశ్ మచ్చాపూర్ గ్రామ శివారంలో ఉన్న జై దుర్గా వైన్స్‌లో పని చేస్తున్నాడు. రోజులాగే వైన్స్ మూసేసి వ్యాపారానికి సంబంధించిన రూ.3.50 లక్షలను తీసుకుని తన మేనల్లుడితో కలిసి మోటారు సైకిల్‌పై ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో మండల కేంద్రానికి సమీపంలో వంతెన వద్ద కొందరు అతని మోటారు సైకిల్‌ను అటకాయించి కత్తితో దాడి చేసి అతని వద్ద ఉన్న డబ్బులు లాక్కునే ప్రయత్నం చేయడంతో అతనికి స్వల్ప గాయాలయ్యాయి. కేకలు వేయడంతో డబ్బులను వదిలేసి పారిపోయారు. బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు.

అంతర్రాష్ట్ర రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

రోడ్డెక్కిన రైతులు

- పత్తికి ధర తగ్గించడంపై రాస్తారోకో
- కిలోమీటరు మేర నిలిచిన వాహనాలు
- ధర్నాతో దిగొచ్చిన సీసీఐ అధికారులు

బేల, డిసెంబర్ 26 : సీసీఐ అధికారులు క్వింటాలు పత్తికి రూ.50 తగ్గించడంపై రైతులు రోడ్డెక్కారు. గురువారం బేల అంతర్రాష్ట్ర రహదారిపై బైఠాయించి సీసీఐకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధర్నాకు బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలుపడంతో కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి రైతులను సముదాయించారు. సీసీఐ అధికారులు వచ్చే వరకు కదిలేది లేదని తెలుపడంతో అధికారులను తీసుకొచ్చారు. పత్తిని కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. నాణ్యతలేని పత్తి, తేమ శాతం అధికంగా ఉన్నట్లయితే పత్తిని కొనుగోలు చేయమని అధికారులు రైతులకు వివరించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సీసీఐ అధికారులు మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521తో కొనుగోలుకు ముందుకు రావడంతో రైతులు ధర్నాను విరమించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. నాణ్యమైన పత్తిని కొనుగోలు చేసి జిల్లా కేంద్రంలో ఉన్న సీసీఐ మద్దతు ధరను రైతులకు ఇవ్వాలని కోరారు. మద్దతు ధరకు సీసీఐ అధికారులు అంగీకరించడంతో రైతులు ధన్యవాదాలు తెలిపారు. దీంతో నాలుగు గంటలపాటు స్థంభించిన వాహనాలను పోలీసులు క్లియర్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు ప్రమోద్ రెడ్డి, దేవన్న, తేజీరావ్, సతీశ్ పవర్, మాస్క్ తేజీరావ్, గంభీర్ ఠాక్రే పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి రామన్న

మాజీ మంత్రి రామన్న పరామర్శ

ఎదులాపురం, డిసెంబర్ 26 : మావల మండలంలోని బట్టిసావర్గాం సర్పంచ్ రాగం గోవర్ధన్ మామ చిన్నయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం మాజీ మంత్రి జోగు రామన్న ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట నాయకులు సర్సింగ్‌రావ్, మెట్టు ప్రహ్లాద్ ఉన్నారు.

5 నుంచి నీటి విడుదల

కడెం, డిసెంబర్ 26 : యాసంగి సాగు కోసం కడెం ఆయకట్టు రైతాంగానికి జనవరి 5వ తేదీ నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ప్రకటించారు. గురువారం కడెం మండల కేంద్రంలోని రైతు వేదికలో కడెం, దస్తురాబాద్, జన్నారం మండలాలకు చెందిన రైతులు, నాయకులు, నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు.

క్రమబద్ధీకరించాల్సిందే..

ఎస్ఎస్ఏల సమస్యలను పరిష్కరించాలి.. తుడుందెబ్బ నాయకులు

ఇంద్రవెల్లి, డిసెంబర్ 26 : సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలని, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు కొనసాగిస్తున్నారు. గురువారం ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు ముత్నూర్ గ్రామంలోని కుమ్రం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంప్రదాయ వాయిద్యాల మధ్య మహా పాదయాత్రతోపాటు భారీ ర్యాలీ నిర్వహించారు. దాదాపు ఐదు కిలో మీటర్ల మేరకు పాదయాత్ర చేశారు. తుడుందెబ్బ నాయకులతోపాటు సమగ్ర శిక్ష ఉద్యోగులు ముందుగా అమరవీరుల జెండాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, అమరవీరులకు నివాళులర్పించారు. భారీగా తరలివచ్చిన ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దిండిగల్ యాదగిరి మాట్లాడుతూ.. 17 రోజులుగా సమ్మె చేస్తున్నా రేవంత్‌రెడ్డి స్పందించకపోవడం విడ్డూరమన్నారు. ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) రాష్ట్ర కో-కన్వీనర్ గోడం గణేశ్ మాట్లాడుతూ.. ఉద్యోగుల పోరాటానికి తమ సంఘం రాష్ట్రవ్యాప్తంగా మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదేరావ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వేట్టి మనోజ్, జిల్లా ప్రచారకార్యదర్శి గేడం భరత్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు రేణుక, జిల్లా ఉపాధ్యక్షురాలు ఉయిక ఇంద్ర, తుడుందెబ్బ మండలాధ్యక్షులు పుర్కా చిత్రు, తుడుందెబ్బ మండల గౌరవ అధ్యక్షులు జుగ్నాక్ భరత్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్, జిల్లా అధ్యక్షురాలు గేడం ప్రియాంక, కార్యదర్శి ధరంసింగ్, సభ్యులు దీప్తి, మమత, శ్రీకాంత్, ప్రశాంత్‌రెడ్డి, ప్రకాశ్, విష్ణు, గణేశ్, సందీప్, సలీం, భగవాన్ పాల్గొన్నారు.

ముత్నూర్ నుంచి భారీ ర్యాలీగా అమరవీరుల స్తూపం వద్దకు వస్తున్న తుడుం దెబ్బ నాయకులు, ఎస్ఎస్ఏ

అమరవీరుల స్తూపం వద్ద బైఠాయించి నిరసన తెలుసుతూ..